ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY




5

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 31 ఆగస్టు 2025



కాళేశ్వరం బ్రిడ్జి వద్ద గోదావరి ప్రవాహం



కమలాపురం ఇన్‌టెక్ వెల్ వద్ద గోదావరి బ్యాక్ వరద

వరద గోదారి

- కాళేశ్వరం, రామన్నగూడెం వద్ద ఉగ్రరూపం
- ఎగువ నుంచి పోటెత్తిన నీరు
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరికలు
- నీటిలోనే పంటలు.. అన్నదాతల ఆందోళన
- మేడిగడ్డ బ్యారేజీకి పెరిగిన తాకిడి
- మంగపేట, కన్నాయిగూడెం, వాజేడులో నిలకడ
- అప్రమత్తంగా ఉన్న అధికార యంత్రాంగం

మహదేవపూర్/ఏటూరునాగారం రూరల్/కన్నాయిగూడెం/ మంగపేట/ వాజేడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతులు నీట మునిగాయి. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద ఉదయం 12.523 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవాహం కొనసాగుతోంది. కాళేశ్వరం పరిసర ప్రాంతాల రైతుల పంటలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. చేతికొచ్చే దశలో పండే పత్తి పంట నీట మునగడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. గోదావరి పరిసర ప్రాంతాల రైతులు, పశువుల కాపరులు గోదావరి వైపు వెళ్లొద్దని అధికారులు తెలుపుతున్నారు. రేపటి వరకు ఇంకా గోదావరి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. పుష్కరఘాట్ వద్ద శుక్రవారం రాత్రి 12 గంటలకు 15.690 మీటర్ల మేర ప్రవహించిన గోదావరి ఆ తర్వాత రెండు గంటల పాటు తగ్గుతూ శనివారం ఉదయం 16.670 మీటర్ల మేరకు గోదావరి ప్రవాహం చేరుకుంది. ఆ తర్వాత రోజంతా పుష్కరఘాట్ వద్ద గోదావరి నిలకడగా కొనసాగింది. గోదావరి నిలకడగా కొనసాగినప్పటికీ పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది.

మేడిగడ్డ బ్యారేజీకి పెరిగిన వరద

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి వరద పెరిగింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో పాటు ఎగువ నుంచి ఎక్కువ వరద ప్రవాహం వస్తుండడంతో మేడిగడ్డ వద్ద శనివారం వరద పెరిగింది ఎగువ నుంచి 10, 25, 600 క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తోంది. ఇప్పటివరకు మేడిగడ్డలో ఇంత ప్రవాహం ఇదే మొదటి సారి. మేడిగడ్డ బ్యారేజీకి 85 గేట్లు ఎత్తి ఉండడంతో దిగువకు 10, 25, 600 క్యూ సెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. అలాగే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద సైతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

కన్నాయిగూడెంలో నిలకడగా..

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఇంటెక్‌వెల్ వద్ద శనివారం గోదావరి తగ్గుతూ, పెరుగుతూ నిలకడగా ప్రవహిస్తూ దోబూచులాడుతోంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 8,57,190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో పెరుగుతూ వచ్చిన గోదావరి.. శనివారం ఉదయం 10గంటల వరకు స్వల్పంగా తగ్గుముఖం పట్టి 8,45,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నమోదైంది. మరలా మధ్యాహ్నం 12 గంటలకు స్వల్పంగా పెరిగిన గోదావరి.. 8,53,270 క్యూసెక్కులుగా నమోదైంది. సాయంత్రం 6 గంటల వరకు నిలకడగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టు ల్లోకి ఎగువనుంచి 8,53,270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో దేవాదుల ప్రాజెక్టులో ఫేజ్ -2లోని ఒక మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని జయశంకర్ జిల్లా భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తున్నారు. మిగిలిన నీళ్లను బ్యారేజీలోని మొత్తం గేట్లు ఎత్తి 8,53,023 క్యూసెక్కులను (మిగతా 8లో..)



కన్నాయిగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీళ్లు



పేరూరు-చంద్రుపట్ల మధ్యలో రహదారిపై నిలిచిన వరద నీరు

రైతు గుండెకోత

వరుస వర్షాలతో అన్నదాతకు భారీ నష్టం

- నీట మునిగిన వందలాది ఎకరాల పంటలు
- నదీ ప్రవాహంతో పొలాల్లో ఇసుక మేటలు
- వరదల కారణంగా కుళ్లిపోయిన వరి నారు
- లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు



రామన్నగూడెంలో నీట మునిగిన వరి పంట పొలాలు

ఏటూరునాగారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏటూరునాగారం ఏజెన్సీలో గత కొన్ని రోజులుగా కురిసిన కుండపోత వర్షాలు, గోదావరి నదికి వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రైతులను కోలుకోలేని దెబ్బ తీసి తీవ్ర నిరాశలోకి నెట్టేశాయి. గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టినా, వరదలు రైతులను కన్నీటి పర్యంతం చేసింది. వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి వరి నారు మండ్లు కుళ్లిపోగా, వరి పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి, పెద్ద పెద్ద గండ్లు ఏర్పడి వ్యవసాయ భూములు పనికిరాకుండా పోయాయి. కళ్లముందే పంటలు నీట మునిగి, ఇసుక మేటలు వేయడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. జంపన్నవాగు, దెయ్యాలవాగు ఉధృతంగా ప్రవహించాయి. ఈ వరదల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని వందలాది ఎకరాల్లో ఎక్కువశాతం వరి, మిర్చి వంటి పంటలు నీట మునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయి.

పొలాల్లో ఇసుక మేటలు.. నష్టపోయిన పంటలు

వరద ఉధృతి తగ్గిన తర్వాత రైతులకు అసలు నష్టం కళ్ళకు కనిపిస్తున్నాయి. అయితే, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వరద నీరు చేరి, ఇసుక మేటలు వేసింది. కొన్ని చోట్ల ఒకటి నుంచి రెండు అడుగుల ఎత్తులో ఇసుక పేరుకుపోవడంతో పొలాలు సాగుకు పనికిరాకుండా పోయాయి. వరి నాటు వేయడానికి సిద్ధం చేసిన వరి నారు, మిర్చి నారు వరద నీటిలో మునిగి కుళ్లిపోయింది. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలం పరిధిలోని చిన్నబోయినపల్లి, గోగుపల్లి, శివపురం, షాపల్లి, దొడ్ల, దొడ్ల కొత్తూరు, లంబాడితండా, కొయగూడ ఎల్లపూర్, రామన్నగూడెం, రాంనగర్ గ్రామాల్లో ఉధృతంగా ప్రవహించిన వరద నీరు సుమారు 20 ఎకరాల్లో పంటను పూర్తిగా నాశనం చేసిందిని, దీంతో తాను తీవ్రంగా నష్టపోయానని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలు, వడగళ్లకు పంట నష్టపోయిన రైతులకు నేటికి పరిహారం అందలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఈ వరదలు తమను మరింతగా దెబ్బతీశాయని రైతులు వాపోతున్నారు. వరద కారణంగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడం, దోమల బెడద విపరీతంగా పెరగడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరిన వరద నీరు పూర్తిగా బయకు వెళ్ళకపోవడంతో మురుగు పేరుకపోయింది.



గోగుపల్లిలో వరదలకు ఇసుక మేటలు వేసిన వరి పంట పొలం

ఇంట్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ పెళ్లి బస్సు


- డ్రైవర్ మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు





దంతాలపల్లిలోని ఓ ఇంట్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు, మృతి చెందిన బస్సు డ్రైవర్ దేవేందర్

దంతాలపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వివాహ రిసెప్షన్‌కు వెళ్లి, తిరుగు ప్రయాణంలో ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతను తప్పించే క్రమంలో బస్సు ఓ ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజు కథనం ప్రకారం. వరంగల్‌కు చెందిన ముస్లింలు శనివారం ఖమ్మంలో పెళ్లి రిసెప్షన్‌కు హాజరై తిరుగు ప్రయాణంలో దంతాలపల్లి మండల కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకోవడంతో అరగంట పాటు శ్రమించి బయటి తీశారు. అంబులెన్స్‌లో ఎక్కించే క్రమంలో ఫీరోజ్ ట్రావెల్స్‌కు చెందిన డ్రైవర్ దేవేందర్ (35) మృతి చెందాడు. మరి కొద్ది మందికి తీవ్ర గాయాలు, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనాల్లో తొర్రూరుకు చికిత్సా నిమిత్తం త రలించారు. ఘటన వద్ద గాయపడ్డ వారు అర్తనాదాలు చేయడంతో స్థానికులు భ యాందోళనకు గురయ్యారు. ప్రైవేటు బ స్సు పూర్తి వివరాలు, డ్రైవర్, బస్సులో ఉ న్న వారి వివరాలను ఆదివారం వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటన లో సుమారు 35 మంది గాయపడ్డారు. ఈఘటనతో జాతీయ రహదారిపై సుమారు అరగంట పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఎస్సై రాజు ఆధ్వర్యంలో వాహనాల రాకపోకను కొనసాగించారు. ఈ ఏడాది మండల కేంద్రంలో జరిగిన రెండో సంఘటనగా స్థానికులు పేర్కొంటున్నారు.



బస్సులో నుంచి దిగుతున్న మహిళలు

ఫారెస్టు అధికారులు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- పట్టాలిచ్చిన భూముల్లో బోర్లు వేసుకోనివ్వాలి
- సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

మహాముత్తారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనాజిపేట గ్రామంలో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలకు చెందిన భూముల్లో బోర్లు వేయకుండా ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని రైతులు తెలపడంతో కాటారం సబ్ కలెక్టర్ మ యాంక్‌సింగ్ శనివారం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆజంనగర్ రేంజీ ఇన్‌చార్జి రేంజర్ రమేష్ కలసి భూములను పరిశీలించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిన భూముల్లో ఎం దుకు బోర్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఫారెస్టు అధికారులను అడిగారు. దీంతో ఫారెస్టు అధికారులు డీఎఫ్‌వోతో మాట్లాడాలని తాము ఎం చేయాలేమని ఆయనకు తెలిపారు. తాను డీఎఫ్‌వోతో మాట్లాడతానని బోర్లు వేయకుండా అడ్డుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీ. శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



ఫారెస్టు అధికారులతో మాట్లాడుతున్న కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

పంట నష్టం ప్రభుత్వం చెల్లించాలి

మేడారం పంట నష్టపరిహార సాధన సమితి డిమాండ్



సమావేశంలో పాల్గొన్న పంట నష్టపోయిన బాధిత రైతులు, ఎంజెపీఎన్‌పీఎస్‌ఎస్ అధ్యక్షుడు ఆలం కృష్ణ



తాడ్వాయి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క సారలమ్మల మహాజాతరకు పంట నష్టపోతున్న రైతులకు పంట నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని పంట నష్టపరిహార సాధన సమితి అధ్యక్షుడు ఆలం కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మేడారంలోని సమ్మక్క భవనంలో ఏర్పాటు చేసిన పంట నష్టపోయిన బాధిత రైతుల సమావేశంలో స్థానిక గ్రామల రైతులు పాల్గొని నష్ట పరిహార సాధన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా ఆలం కృష్ణ, ఉపాధ్యక్షులుగా గొంది రమేష్, భూక్య శ్రీను, జంగ హనుమంతరెడ్డి, అల్లెం కిరణ్, ప్రధాన కార్యదర్శులు దబ్బ సాంబశివరావు, చర్ప చంద్రశేకర్, మొక్క నరేందర్, ఎల్లబోయిన ముత్తేష్, గౌరవ అధ్యక్షుడుగా రామ సహాయం శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు చిడం బాబురావు, గొంది శ్రీధర్, సిద్దబోయిన శివరాజు, జీడి బాబురావు, సోలం వెంకన్న, పీరీల వెంకన్న, గోపాలపురం సతీష్, నల్ల మెక్క లక్ష్మీ సమ్మయ్య, సంకె ప్రణయ్, ఆలం సమ్మారావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు కృష్ణ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహా జాతర నిర్వహణ, అభివృద్ధికి 150 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం నిరుపేదలైన రైతులకు జాతర సంమయంలో పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మేడారంతో పాటుగా ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, రెడ్డిగూడెం, నార్లాపూర్, వెంగళాపూర్ గ్రామాల్లో వందల ఎకరాల భూమితో 2వేల మంది రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన ములుగు జిల్లా ఎస్పీ శబరీష్

ములుగు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన ఆరుగురు మావోయిస్టులు శనివారం ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టుల వివరాలను శనివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. తాటి ఉంగి (ఏసీఎం సభ్యుడు), కొడిమె సుక్కు, సోడి భీమా, కుంజం వరలక్ష్మి (పార్టీ సభ్యురాలు), కొరుస పాయిక, సోడి అద్మ ఉన్నారన్నారు. వీరికి తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25వేలు అందించామన్నారు. లొంగిపోయిన వారికి ఏసీఎం క్యాడర్‌కు రూ.4లక్షలు, పార్టీ సభ్యుడికి రూ.లక్ష, మిలీషియా సభ్యుడికి రూ.25వేల చొప్పున ప్రభుత్వం నుంచి త్వరలో సహాయాన్ని అందిస్తామన్నారు. కాగా, 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 80 మంది నక్సల్స్ స్వచ్ఛందంగా లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయి, ప్రశాంత జీవితం గడపాలని ఎస్పీ శబరీష్ సూచించారు. సమావేశంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ శివంఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టులతో జిల్లా పోలీసులు

ఆదివాసీల భూములు లాక్కుంటే ఊరుకోం..

మహాముత్తారం, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మగూడెం గ్రామంలో 70 ఏళ్లుగా ఆదివాసీ గిరిజన రైతుల సాగు చేసుకొంటున్న 600 ఎకరాల భూములను ఇప్పుటు పట్టా పేరుతో లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోమని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా పూల్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన నిమ్మగూడెంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. 1956లో నిజామాబాద్‌కు చెందిన ఓ ముక్తేదారు 600 ఎకరాలను ఇక్కడి రైతులకు తెలియకుండా రాజకీయ పలుకుబడితో పట్టా చేసుకొన్నాడని తెలిపారు. ఆ వ్యక్తికి నిమ్మగూడెం గ్రామంతో ఎలాంటి సంబందాలు లేవని అన్నారు. ధరణి ప్రవేశ పెట్టిన ఆనంతరం రికార్డుల్లో భూమి రావడంతో ఇక్కడి రైతులను ఇబ్బందులకు గురి చేసున్నారని తెలిపారు. కలెక్టర్ ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి ఇక్కడి పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మగూడెం గ్రామానికి చెందిన వంది మంది రైతులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ఏటూరునాగారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో అత్యాచారం కేసులో సంచలన తీర్పు వెలువడింది. ములుగు జిల్లా ప్రిన్సిపాల్, సెషన్స్ న్యాయమూర్తి ఎస్.వీ సూర్య చంద్రకళ ఒక పోక్సో కేసులో నిందితుడైన ఎమ్డీ.గౌస్ పాషాకు శనివారం 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో 20 ఏళ్ల జీవిత ఖైదుతో పాటు రూ. 3వేల జరిమానా కూడా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన దుబ్బా బాబు ఫిర్యాదు మేరకు.. ఈ కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన ఎమ్డీ. గౌస్ పాషా, అతడి ఇంటిపక్కనే ఉన్న బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

బాధితురాలు గిరిజన తెగకు చెందినది కావడంతో ఈ కేసులో ఐపీసీ సెక్షన్లతో పాటు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టాలను కూడా చేర్చారు. అయితే, ఈ కేసు మొదటగా ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. కాగా, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అశోక్ కుమార్ దర్యాప్తును ప్రారంభించారు. ఆ తర్వాత ప్రస్తుత ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ దర్యాప్తును కొనసాగించారు. విచారణలో నిందితుడు ఎమ్డీ. గౌస్ పాషా నేరం చేసినట్లు నిర్ధారణ కావడంతో, పటిష్టమైన ఆధారాలతో ఛార్జ్ షీట్ కోర్టులో సమర్పించారు. దీంతో కేసులోని ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత, నిందితుడిపై పోక్సో, ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద ఉన్న అభియోగాలను కోర్టు నిర్ధారించింది. దీంతో నిందితుడికి జైల్ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి చంద్రకళ తీర్పు వెలువరించారు.

కుటుంబ కలహాలతో జీపీ కార్మికుడి ఆత్మహత్య


మృతిచెందిన వెంకటాద్రి

చిలుపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది జీపీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపల్లిలో శనివారం జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం. గ్రామానికి చెందిన మోతె వెంకటాద్రి (58)జీపీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటాద్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో ఒకరి రిమాండ్

మహదేవపూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన 2024 డిసెంబర్ 27న ఉల్లాల భాగ్యలక్ష్మి ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఈ సంవత్సరం జనవరి 12న మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు విచారణ చేపడుతూనే ఉన్నారు. మొబైల్ , టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా శుక్రవారం రాత్రి కేసు కొలిక్కి వచ్చింది. భూపాలపల్లి జిల్లా కమలాపూర్ అడవి ప్రాంతంలో పెట్రోల్ పోసి సజీవ దహనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. మల్హర్ మండలం వల్లగొండ గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి ఆమెను కిరాతకంగా చంపి పెట్రోల్ పోసి దహనం చేసినట్లు తెలిసింది. శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాం డ్‌కు పంపినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. భాగ్యలక్ష్మి దగ్గర పరిచయం ఏర్పడి రూ.14 లక్షలు తీసుకుని ఆమె అడినందుకే చంపినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కదిలిస్తే కన్నీరే..

● వరద విధ్వంసానికి నేటికి ఏడాది ● నెరవేరని ముఖ్యమంత్రి హామీలు ● అర్హులకు అందని పంటనష్ట పరిహారం


సీతారాంతండాను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

మరిపెడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గతేడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షంతో మహబూబాబాద్ జిల్లా అతులాకుతలమైన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాంత ప్రజలు అప్పటి ఆ జల ప్రళయం గుర్తు చేసుకొని కదిలిస్తే కన్నీరు పెడుతున్నారు. ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకోగా అప్పుడు సహాయం కోసం పెట్టిన ఆర్తనాదాలను బాధితులు గుర్తు చేసుకొని కన్నీటి పర్యాంతం చెందుతున్నారు. స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి సీతారాంతండాను సెప్టెంబరు 3న సందర్శించారు. బాధితులను కలిసి పరామర్శించి ఆయన ఇచ్చిన హామీలు ఏడాదైనా నెరవేరకపోవడంతో బాధిత కుటుంబాలు ప్రభుత్వంపై ఊసురుమంటున్నారు. పైరవీకారులకే పంట నష్టం ఇచ్చారని అర్హులైన రైతులు వాపోతున్నారు. ఆ వరద విధ్వంసానికి అప్పట్లో ఉల్లెపల్లి, సీతారాంతండా, బాల్నిదర్మారంలోని మొత్తం 172 ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకొని కట్టుబట్టలతో మిగిలిపోయారు. సుమారు 44పశువులు, 100 గొర్రెలు, మేకలు నీటి ప్రవాహానికి కొట్టుకపోయాయి. సుమారు 600 ఎకరాల్లో పంట నష్టం తీవ్రంగా జరిగిందని బాధితులు గుర్తు చేస్తున్నారు.

అరకొర సాయంతో చేతులు దులుపుకున్న ప్రభుత్వం

కుంభవృష్టి వర్షంతో సరస్వం కోల్పోయిన ఉల్లెపల్లి, సీతారాంతండా, బీచ్‌రాజ్‌పల్లి, బాల్నిదర్మారం గ్రామాల బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అరకొర సహాయంతోనే చేతులు దులుపుకుందని ముంపు రైతులు ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. అసలు పంట నష్టపోయిన రైతులకు కొసరేసినట్టు సాయం అందించి పైరవీకారులకు పెద్ద పీట వేశారని మండిపడుతున్నారు. ఇళ్ల ముంపు బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా మెట్ట ప్రాంతంలో ఇంతవరకు ఇళ్లు కట్టివ్వలేదని ఆయన హామీపై అధికారులలో ఇసుమంతైన కదిలికలేదని చెబుతున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న ముంపు ఇళ్ల బాధితులకు కొందరికి రూ.10వేల సహాయం అందించి అధికారులు చేతులు దులుపుకున్నారని విమర్శలు చేస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకలు నష్టపోయిని బాధితులకు ఒక్క పైసా ఇవ్వలేదని కంటతడి పెడుతున్నారు.


వరద తాకిడికి పురుషోత్తమాయగూడెం ఆకేరు బ్రిడ్జి దగ్గర ధ్వంసమైన జాతీయ రహదారి (ఫైల్)

ఆకేరు బ్రిడ్జి పనులు అంతంతే..

వర్షంతో 365 జాతీయ రహదారిపై పురుషోత్తమాయగూడెం దగ్గర ఆకేరు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు డ్యామేజీ అయినప్పటికీ శాశ్వత మరమ్మతులు చేపట్టలేదని స్థానికులు అంటున్నారు. పనులు అంతంత మాత్రం చేశారంటున్నారు. మళ్లీ అలాంటి ఉపద్రవం ముంచుకొస్తే బ్రిడ్జి దుస్థితి పెను ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని బాల్నిధర్మారం బ్రిడ్జి వలే లేచి పోవడం ఖాయమంటున్నారు.

రెండెకరాల పంట నష్టపోయా..



నిరుడు వచ్చిన వర్షాలకు తండాధర్మారం రెవెన్యూ పరిధిలో ఆకేరు పక్కన రెండెకరాల వరి పొలం కొట్టుకపోయింది. పైసా సాయం అందలే. అసలైన రైతులకు ఇవ్వకుండా పైరవీకారులకే ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు.

- గుగులోత్ ద్వాలీ, సీతారాంతండా

సీఎం మాటలు ఉట్టి మూటలైనవి



సీఎం రేవంత్‌రెడ్డి సీతారాంతండాకు వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి తండావాసులకు మాటిచ్చిండు. మెట్ట ప్రాంతంలో ముంపు బాధితులకు ఇళ్లు కట్టిస్తానని చెప్పిండు. ఆయన మాటలు ఉట్టి నీటి మాటలైనవి. అధికారులు మా బాగోగులు పట్టించుకోవట్లేదు. వర్షాకాలం వస్తే కంటి మీద కునుకు ఉంటలే.

- గుగులోత్ సరోజ, సీతారాంతండా

పాఠశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

మహదేవపూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) విజయలక్ష్మి సందర్శించారు. స్టోర్ రూం, కిచెన్, డైనింగ్ హాల్, హాజరు పట్టికలను పరిశీలించారు. తదుపరి విద్యార్థుల ముఖాముఖిలో పాఠశాలలో వసతి, భోజన సౌకర్యాలపై మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏజీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మరిన్ని లక్ష్యాలను సాధించాలన్నారు. భవిష్యత్‌లో ఏం అవ్వాలని అనుకుంటున్నారని విద్యార్థులను తెలుసుకు న్నారు. ఒకరు కలెక్టర్, ఒకరు టీచర్, డాక్టర్ కావాలని అనుకుంటున్నామని తెలిపారు. ఈ ఆకస్మిక పర్యటనలో ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీవో శ్రీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పాఠశాల వార్డెన్ దేవి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గూడూరులో 'చిన్న కాళేశ్వరం' భూసేకరణ గ్రామసభ

కాటారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాదరావుపేట జీపీ కార్యాలయం ఆవరణలో చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గూడూరు పెద్ద చెరువు కట్ట విస్తరణకు సంబంధించి భూసేకరణ కోసం శనివారం గ్రామసభ నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ప్రాజెక్టుల భూసేకరణ విభాగం)నేతృత్వంలో 3 ఎకరాల 23గుంటల భూసేకరణ కోసం జరిగిన గ్రామసభలో పలువురు రైతులు హాజరై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలిపారు. ఈ మేరకు గత జాబితాలో ఉండి ప్రస్తుతం తమ పేర్లు రాలేదని కొందరు రైతులు లిఖితపూర్వకంగా తెలిపారు. కార్యక్రమంలో కాటారం తహసీల్దార్ నాగరాజు, ఎస్‌డీసీ డీఐ గంగాధర్, నాయబ్ తహసీల్దార్ షఫీ అహ్మద్, ఆర్ఐ వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈఈలు వెంకన్న, శిరీష, సర్వేయర్ వినయ్, రైతులు ఉన్నారు.

టేకు కలప స్వాధీనం

వెంకటాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీశాఖ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దాల్మియా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపం నుంచి వ్యాన్‌లో టేకు కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎదిర, రామచంద్రాపురం, వెంకటాపురం అటవీశాఖ సిబ్బంది, బేస్‌క్యాంప్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈక్రమంలో మొర్రవానిగూడెం గ్రామశివారులో అటవీశాఖ అధికారులను గమనించిన వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని పక్కనపెట్టి పరారీ అయ్యాడన్నారు. దీంతో వాహనాన్ని పరిశీలించగా రూ.5లక్షల విలువచేసే 20టేకు మొద్దులను గుర్తించి వ్యాన్‌ను అటవీశాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, దేవయ్య, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్‌దాస్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డివిజన్ కమిటీ ఏర్పాటు

ఏటూరునాగారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ములుగు డివిజన్ కొత్త కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిలో నూతన ములుగు డివిజన్ అధ్యక్షులుగా పొదెం కృష్ణ ప్రసాద్, ఏటూరునాగారం మండల కార్యదర్శిగా గడ్డి శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా కబ్బా ఆదినారాయణ, అసోసియేట్ ప్రెసిండెంట్‌గా రామ గోవిందం వీరితో పాటు, మరో 11 మంది సభ్యులను కూడా మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి సంఘం సభ్యులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక జీపీలుగా ఏర్పాటు చేయాలి

బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి నాగజ్యోతి


గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండలంలోని ఎక్కెల, భూటారం, చింతలపాడు, గంటలకుంట గ్రామాలకు ప్రత్యేక గ్రామ పంచాయతీలను మంజూరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్ బా బు) జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌ను గ్రామస్తులతో కలిసి శనివారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ.. మండలంలో ఈ మూడు గ్రామాలు పెద్దవిగా ఉండడంతోపాటు, గత కొంతకాలంగా అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని, వాటిని ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా విభజిస్తే తిరిగి అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని ఆయన కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయడం వల్ల వారికి మెరుగైన పరిపాలన అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ మూడు గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి, వాటి మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వినతి సమర్పించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందనాయక్, ఎక్కెల, భూటారం, గంటలకుంట, చింతలపాడు గ్రామాల గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'డబుల్' ఇళ్ల పంపిణీలో గందరగోళం

● తహసీల్దార్ సెలవులో ఉండగా, ఆర్ఐ పంపిణీ
● ప్రొటోకాల్ పాటించలేదన్న బీఆర్ఎస్
● దొంగచాటుగా పట్టాల పంపిణీపై నిలదీత

తరిగొప్పుల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని అక్కరాజుపల్లి గ్రామస్థులు, బీఆర్ఎస్ నాయకులు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామంలో అప్పటి ప్రభుత్వం 30 ఇళ్లు నిర్మించింది. వాటి పంపిణీ విషయంలో లబ్ధిదారుల ఎంపిక కోసం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించినా తుది జాబితా తయారు చేయకపోవడంతో పంపిణీకి నోచుకోలేదు. తుదిజాబితా కొలిక్కిరాకపోయినా శనివారం తహసీల్దార్ మహిపాల్ రెడ్డి సెలవులో ఉండగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంధ్రయ్య లబ్ధిదారులను కార్యాలయానికి పిలిపించుకుని పట్టాలు పంపిణీ చేస్తుండడంపై గ్రామస్థులు, బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు.


తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

పట్టపగలు దొంగచాటున పట్టాలు పంపిణీ బాగోతం ఎంటని ప్రశ్నించారు. ప్రోటోకాల్ ప్రకారం గ్రామ సభ నిర్వహించి ఎమ్మెల్యే సమక్షంలో పంచాల్సిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు అధికారులు ఎందుకు దొంగచాటున ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి తహసీల్దార్ మహిపాల్ రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేకపోవడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంధ్రయ్యను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

వాజేడులో గంజాయి పట్టివేత

● ఇద్దరి అరెస్టు, పరారీలో మరో ఐదుగురు ● రూ. 15లక్షల విలువైన 30 కేజీల గంజాయి పట్టివేత
● వివరాలు వెల్లడించిన ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

వాజేడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాజేడు మండలంలో శుక్రవారం భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువస్తుండగా వాజేడు పోలీసులు గంజాయి తరలిస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఏడుగురు యువకులు గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. మరో ఐదుగురు యువకులు పోలీసులను చూసి పరారయ్యారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని వెంకటాపురం మండలం వైపు నుంచి ఏటూరునాగారానికి ద్విచక్ర వాహనాలపై గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో వాజేడు ఎస్సై జక్కుల సతీష్ సిబ్బందితో శుక్రవారం ఉదయం మండలంలోని మండపాక వద్ద నాలుగు ద్విచక్ర వాహనాల్లో వస్తున్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకోగా మరో మూడు ద్విచక్ర వాహనాల్లో ఉన్న వారు గంజాయితో ఉన్న బ్యాగులను రోడ్డుపైనే పడేసి పరారయ్యారు.

పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు యువకులను వాజేడు స్టేషన్‌కు తరలించి విచారించగా.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 8వ ఇన్‌క్లైన్‌కు చెందిన మేకల మహేందర్, కొల్లి అజయ్, జంజిర్ల రోహిత్, జంజిర్ల బాలాజీ, రుత్విక్‌లు స్నేహితులు. వీరంతా గోదావరిఖనిలో గంజాయికి అలావాటు పడి చుట్టుపక్కల గ్రామాలలో డబ్బులకు గంజాయిని విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలకు అలావాటు పడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 18న ఒడిస్సాకు వెళ్లి అక్కడ ఒక వ్యక్తి సాయంతో రూ లక్షా 15వేలతో 30 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఐదుగురు తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాల్లో ఒక బైక్ మరమ్మతులకు గురైంది. దీంతో గోదావరిఖనికి చెందిన మరో ఇద్దరు యువకులైన తోగరి విష్ణువర్ధన్, జెనజర్ల రేవంత్‌లకు ఫోన్ చేసి పిలిపించుకున్నారు. దీంతో ఇద్దరు యువకులు బైక్‌పై వెంకటాపురానికి వచ్చి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో మండపాక వద్ద పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఆ ఐదుగురు యువకులు పోలీసులను చూసి పరారయ్యారు. వీరి వద్ద నుంచి 29 కేజీల 829గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, గంజాయి విలువ రూ 15లక్షలు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఐదుగురు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు, వీరందరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. సమాచారం రాగానే సత్వరంగా స్పందించిన వాజేడు పోలీసులను ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అభినందించారు. మీడియా సమావేశంలో వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, ఎస్సై సతీష్ ఉన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ఐటీఐలతో పరిశ్రమల అనుసంధానం

- యాజమాన్యాలతో చర్చలకు టీ-గేట్ కమిటీలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నాలుగు ఏర్పాటు
- ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకాశాల దిశగా అడుగులు
- ఏటీసీల రాకతో మరిన్ని ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లాలో 7 ప్రభుత్వ ఐటీఐలు, 18 ఏటీసీలు
- మారుతున్న ఐటీఐల స్వరూప, స్వభావాలు

హనుమకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లలో శిక్షణ పొంది నైపుణ్యాలతో బయటకు వస్తున్న విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడంలో వెనుకబడిపోతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం, పరిశ్రమలతో మాట్లాడి ఉద్యోగావకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం తెలంగాణ గేట్ ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ (టీ-గేట్) విధానాన్ని రూపొందించింది. రాష్ట్రంలో ఒకేషనల్ శిక్షణ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తూ.. పరిశ్రమలు ఐటీఐలకు మధ్య అంతరాన్ని తగ్గించడంతో పాటు ఉద్యోగాలు పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. రానున్న రెండేళ్లలో ప్రభుత్వ ఐటీఐలలో ప్లేస్‌మెంట్‌ను 60 శాతానికి పెంచడంతో పాటు 50 శాతం అప్రెంటీస్ విధానంతోపాటు నూరు శాతం ఐటీఐలన్నీ పరిశ్రమలతో అనుసంధానం అయ్యేలా కాలపరిమితితో కూడిన లక్ష్యాలను నిర్ణయించింది. టీ-గేట్ లోగోను, కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఇటీవల కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో ఏడు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. త్వరలో ఈ ఏడు ఐటీఐలలోనే కాకుండా ఉమ్మడి జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 18 ఏటీసీలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఐటీఐలు ప్రస్తుతం- ఏటూరునాగారం, వాజేడు, మహబూబాబాద్, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, కాజీపేటలలో ఉన్నాయి.



కాజీపేటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల

అనుసంధానం..

ప్రస్తుతం ఐటీఐలలో అందిస్తున్న కోర్సులు పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా లేవు. ఈ రెండింటి మధ్య అంతరం భారీగా ఉండడంతో ఇప్పటివరకు 30 శాతమే ప్లేస్‌మెంట్ లభిస్తోంది. పరిశ్రమలతో భాగస్వామ్యం లేకపోవడం వల్ల ఇక్కడి విద్యార్థులకు ప్రాక్టికల్ ట్రైనింగ్ లభించడం లేదు. ఈ పరిస్థితులను అధిగమించడంతో పాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ టీ-గేట్ కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం కింద ప్రతీ ప్రభుత్వ ఐటీఐకి ఒక టీ-గేట్ కమిటీ ఏర్పాటు అవుతుంది. ఈ కమిటీలు ఐటీఐకి 50 కి.మీ. పరిధిలోని స్థానిక పరిశ్రమల్ని గుర్తిస్తాయి. ఆయా పరిశ్రమల్లో ఉద్యోగాలు, అక్కడి నైపుణ్యాలు తెలుసుకొని ఆన్‌జాబ్ ట్రైనింగ్, అప్రెంటిస్‌షిప్ అవకాశాల్ని కల్పిస్తాయి. పరిశ్రమలు, ఐటీఐకి మధ్య అంతరాన్ని అధ్యయనం చేసి, ఆ మేరకు వ్యూహాత్మక కోర్సులు రూపొందిస్తాయి. నెల నుంచి మూడు నెలల స్వల్పకాలిక, 3 నుంచి 6 నెలల మధ్య కాలిక, 1 నుంచి 2 ఏళ్ల దీర్ఘకాలిక కోర్సులు రూపొందించి ఆ మేరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను స్థానికంగా అందుబాటులో ఉన్న పరిశ్రమలకు అనుసంధానం చేస్తూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కోర్సులు పూర్తికాగానే ఆయా పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

నలుగురు సభ్యులతో..

టీ-గేట్ జిల్లా ప్లేస్‌మెంట్ కమిటీలకు చైర్మన్‌గా ఏదైనా పరిశ్రమ అధిపతి, కన్వీనర్‌గా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, సభ్యులుగా ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ, ఉపాధి కల్పన శాఖల అధికారులు, ఒక ఎన్‌జీవోస్ సంస్థ ప్రతినిధి ఉంటారు. స్థానికంగా పరిశ్రమల యాజమాన్యలతో ఈ కమిటీలు చర్చలు జరిపి విద్యార్థులను సిఫార్సు చేస్తాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నాలుగు ఐటీఐలలో టీ-గేట్ కమిటీలు ఏర్పాటు అయ్యాయి. ఈ కమిటీలకు ఇన్‌స్టిట్యూట్ మేనేజ్ మెంట్ కమిటీ (ఐఎంసీ) చైర్మెన్, ప్రముఖ పారిశ్రామిక వేత్త నరేంద్ర చౌహాన్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయనతో పాటు వైస్‌చైర్మన్‌గా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్, కన్వీనర్‌గా ఐటీఐ ప్రిన్సిపాళ్లు ,సభ్యులుగా జిల్లా ఉపాధి కల్పనా అధికారి (డీఈవో), ఒక ఎన్‌జీవో సంస్థ నిర్మాణ్ ప్రతినిధి ఉన్నారు. టీ-గేట్‌లు ఐటీఐలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాయి. ఐటీఐలకు అవసరమైన ఫండింగ్‌ను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సుబులిటీ (సీఎస్ఆర్) స్కీమ్ కింద ఆయా కంపెనీల నుంచి సమకూర్చుతున్నాయి. ఈ కమిటీలు ఇప్పటికే వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశాలు జరిపాయి.

వంద శాతం ప్రవేశాలు

యువత ఖాళీగా ఉండకుండా వారు ఏదైనా వృత్తిపరమైన కోర్సులో శిక్షణ పొందేలా ఐటీఐలలో వందశాతం ప్రవేశాల కోసం ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీ-గేట్ కమిటీలు ఈ దిశగా కృషి చేస్తున్నాయి. ప్రస్తుతం ఐటీఐలలో ప్రవేశాలు జరుగుతున్నాయి. వీటితో పాటు ఏటీసీలలో కూడా అడ్మిషన్స్ తీసుకుంటున్నారు. వీటిలో అందుబాటులో ఉన్న అన్ని సీట్లు భర్తీ అయ్యేలా చూడడానికి టీ-గేట్ కమిటీలు తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రవేశాలపై విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నాయి. ఇందులో భాగంగా స్వయం సహాయ బృందాలు, మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్య, గ్రామ కమిటీలు, మహిళా సంఘాలను టీ-గేట్ కమిటీలు సంప్రదిస్తున్నాయి. ఐటీఐ పూర్వ విద్యార్థుల సహకారాన్ని కూడా తీసుకుంటున్నారు. చివరికి వాట్సాప్ గ్రూప్‌లను కూడా ఆశ్రయిస్తున్నారు. ఐటీఐలలో వంద శాతం ప్రవేశాలు పూర్తి చేయడం, శిక్షణ పూర్తయిన వెంటనే వారికి వంద శాతం ప్లేస్‌మెంట్ ఇవ్వడం లక్ష్యంగా ప్రణాళికను అమలు చేస్తున్నాయి.

స్థానిక పరిశ్రమలతో ఒప్పందాలు

స్థానిక పరిశ్రమల్లో ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా టీ-గేట్ విధానం కింద ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఐటీఐల్లో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు గుర్తించిన పరిశ్రమల్లో ఉద్యోగులుగా రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా నేర్పించడంపై దృష్టి పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ రకాల పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా ముందు శిక్షణ కార్యక్రమాలను రూపొందించబోతున్నారు. మరోవైపు ఏటీసీలు, ఐటీఐలలో మొదటి విడతలో సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ కాలేదు. రెండో విడతలో విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఐటీఐలు, ఏసీటీల్లో చేరితే విద్యార్థులు పొందే ప్రయోజనాలపై ప్రిన్సిపాళ్లు, ఇన్‌స్ట్రక్టర్లు పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు

వి.వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్, కాజీపేట ప్రభుత్వ ఐటీఐ



ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఏటూరునాగారం, హనుమకొండ, కాజీపేటలలోని ఐటీలకు టీ-గేట్ కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలు ఇప్పటికే నాలుగైదు సార్లు సమావేశం అయ్యాయి. మిగతా వాటికి త్వరలోనే ఏర్పాటు కానున్నాయి. ఐటీఐలు, ఏటీసీల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. టీ-గేట్ విధానం ద్వారా అందుబాటులోని పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకొని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కార్యాచరణ సిద్ధమైంది. ప్రభుత్వ ఐటీఐలలో చేరిన విద్యార్థులకు ఈ ప్రయోజనాలు అందనున్నాయి.


ఇల్లందలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

చౌక బియ్యం పంపిణీ పునఃప్రారంభం

- 3 నెలల తర్వాత బియ్యం తీసుకోనున్న లబ్ధిదారులు
- కొత్త రేషన్ కార్డుదారులకూ అందనున్న బియ్యం
- సన్నబియ్యంతో రేషన్ షాపుల వద్ద బారులు తీరనున్న ప్రజలు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1 నుంచి చౌక బియ్యం పంపిణీ పునఃప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వం మూస్నెళ్ల పాటు ఒకేసారి రేషన్ బియ్యం పంపిణీ చేయడంతో ఇన్ని రోజుల పాటు రేషన్ షాపులు వెలవెలబోయాయి. దీనికి తోడు ఒకేసారి సన్న బియ్యం రావడంతో ఇప్పటికే ఇంటిలో నిండుకున్నాయి. దీంతో రేషన్ బియ్యం సరఫరాపై ఎదురు చూస్తున్నారు. వరంగల్ జిల్లాలో 509 రేషన్ షాపులు ఉండగా 2,66,429రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రభుత్వం నూతనంగా మరో 16,251 కార్డులను మంజూరు చేసింది. సెప్టెంబరు 1 నుంచి పాత, కొత్త కార్డులకు కలిపి 2,82,680 కార్డులను బియ్యం పంపిణీ చేయనున్నారు. వీరి కోసం 53,82,518 మెట్రిక్ టన్నుల బియ్యం సమకూర్చనున్నారు.

రేషన్ షాపులకు తరలుతున్న బియ్యం


గత వారం రోజుల నుంచి రేషన్ షాపులకు చౌక బియ్యం తరలిస్తున్నారు. సెప్టెంబరు 1 నుంచి ఇవ్వాల్సి ఉండగా ఏ షాపుకు ఇబ్బంది లేకుండా మొదటి విడతగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 509 రేషన్ దుకాణాలకు గాను వర్ధన్నపేట, నర్సంపేట, ఏనుమాములలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం లారీల్లో తరలిపోతున్నాయి. కోటాలో తేడాలు ఉంటే మళ్లీ డీలర్ల అభ్యర్థన మేరకు బియ్యాన్ని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. బియ్యం పంపిణీ, సరఫరాలపై సివిల్ సప్లయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సన్న బియ్యంతో బారులు తీరనున్న ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం జులై నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. ఈ మేరకు రేషన్ కార్డులో ఉన్న కుటుంబాలకు ఒక్కో వ్యక్తికి 6కిల్లో సన్న బియ్యాన్నే అందిస్తున్నారు. దీంతో గతంలోనే సన్న బియ్యాన్ని తీసుకునేందుకు లబ్ధిదారులు బారులు తీరారు. మళ్లీ మూస్నేళ్ల తర్వాత బియ్యం ఉండడం, వాటిలోనూ సన్న బియ్యం కావడంతో అప్పటికంటే ఇప్పుడు ఎక్కువగా రేషన్ షాపుల వద్ద హడావుడి ఉండే అవకాశం ఉంది.

పోషకాలు పుష్కలం..

ప్రభుత్వం కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి పోషకాల బియ్యాన్ని ప్రజలకు సరఫరా చేస్తుంది. కానీ, కొందరు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయని భ్రమ పడుతున్నారు. క్రమం తప్పకుండా ఈ బియ్యాన్ని వాడితే మహిళల్లో రక్తహీనత తగ్గుతుందని పేర్కొంటున్నారు. పోషకాల బియ్యం నరాల పటిష్టతకు, రక్తం వృద్ధి చెందడానికి, మెదడు సక్రమంగా పనిచేయడానికి ఉపయోగపడతాయి. ఇవే బియ్యాన్ని పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి, అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్నారు. ఈ పోషకాల బియ్యంపై చాలా మంది అపోహలు ఉన్నాయి. ఈ బియ్యాన్ని తలసేమియా వ్యాధి బాధితులు తప్ప అందరూ తినవచ్చు. ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వ పోషకాల బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. 99 కిలోల సాధారణ బియ్యానికి ఒక కిలో పోషకాల బియ్యాన్ని జత చేస్తుంది. రైస్ మిల్లుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ప్రజలకు విషయంపై అవగాహన ఉండడం లేదు. బియ్యం వండే ముందు కడిగినప్పుడు నీటి మీద తేలేవే పోషకాల బియ్యం. ఈ బియ్యాన్ని చాలా మంది ప్లాస్టిక్ బియ్యంగా భావించి బయట పడేస్తున్నారు. పైన తేలిన బియ్యం గింజలను పక్కకు తీసి మిగిలిన బియ్యం కడిగేసుకోవాలి. తర్వాత పక్కన తీసిన బియ్యం గింజలను మిగతా బియ్యంలో కలుపుకుని వండుకోవాలి. రేషన్ బియ్యంలో బీ12, ఐరన్, పోలిక్, యాసిడ్ లాంటి పోషకాల ఉంటాయని అధికారులు చెబుతున్నారు.


వరంగల్ పిన్నవారి వీధిలో ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పంచముఖ విఘ్నేశ్వరుడు



వరసిద్ది కాణిపాక వినాయకుడు


శివపూజ గణపతి


వినాయక గాన కచేరి.. శివ పార్వతుల నృత్యం


నృత్య అభిషేక శివలింగం


అద్దాల వినాయకుడు


వరంగల్ పెరుక వాడలో ఏర్పాటు చేసిన పంచ ముఖ గణేషుడు


ఉద్యానవనములో గణేష్ విగ్రహం

ఏకదంతుడి రూపాలు ఎన్నెన్నో..

- విభిన్న థీమ్‌లతో గణేష్ విగ్రహాల ఏర్పాటు
- ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా భారీ సెట్టింగ్‌లు
- ఆకర్షిస్తున్న విఘ్నేశ్వర ప్రతిమలు

మట్టెవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు నగరంలో ఘనంగా జరుగుతున్నాయి. ఒక్కో మండపం వద్ద ఒక్కో రూపంలో విఘ్నేశ్వరుడు దర్శనమిస్తున్నాడు. ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించే విధంగా భక్తులు భారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. మండపాలను అత్యంత వైభవంగా విభిన్నరూపాల్లో ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా వరంగల్ పిన్నవారి వీధిలో ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో పంచముఖ విఘ్నేశ్వర విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అదే విధంగా నగరంలో శివపూజ గణపతి, వరసిద్ధి కాణిపాక వినాయకుడు, అద్దాల వినాయకుడు, ఉద్యానవనంలో గణేష్ విగ్రహం, వినాయక గాన కచేరి, శివపార్వతుల నృత్యం, నృత్య అభిషేక శివలింగం, జ్యోతిర్లింగాలు, దశావతారాల రూపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు.


పిన్నవారి వీధిలో 44 సంవత్సరాలుగా..

వరంగల్ పిన్నవారి వీధి ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో 44 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఒక్కోసారి ఒక్కో రూపంలో ఆధ్యాత్మిక చింతనతో కూడిన సెట్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. విభిన్న రూపాల్లో గణనాథుడిని ప్రతిష్టిస్తున్నారు. హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. నవరాత్రుల్లో ప్రతిరోజూ క్వింటా ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్నారు.

విశేషాల వినాయకుడు ఆదిదేవా

- నాలుగు దశాబ్దాల 'నాయకుడు'
- ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా రూ.4.51 లక్షలకు పైగా లడ్డూ వేలం
- 499 మంది సభ్యులతో సంక్షేమ సంఘం


కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ షెడ్ వేసి ఏర్పాటు చేసిన వినాయకుడు



కేసముద్రం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాలకు చందాలు అడగకుండా సంక్షేమ సంఘం ద్వారా భారీ ఖర్చులతో నవరాత్రి వేడుకలు నిర్వహించడం విశేషంగా మారింది. కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ, ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్, రైల్వే ఎంప్లాయిస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి అన్నీ ప్రత్యేకతలే ఉన్నాయి. ఈ వినాయకుడిని 1981 నుంచి ఏర్పాటు చేస్తున్న గణేష్ ఉత్సవాలకు ఏటా చందాలు లేకుండా 2011లో అనుబంధంగా కుల, మతాలకతీతంగా 160 మందితో 'ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్'ను ఏర్పాటు చేశారు. ఈ సంఘంలో ప్రస్తుతం 499 మందితో రూ.50 లక్షల మూలధనంతో కొనసాగుతుండగా ఇందులోంచే ఉత్సవాలకు ఖర్చు చేస్తున్నారు. సంఘంలో కేసముద్రం మండలంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నాయకులు, అన్నివర్గాల యువకులు, హిందుముస్లీంలు ఈ సంఘంలో సభ్యులుగా ఉండడం విశేషం. సంఘం తరఫున రెండుసార్లు సభ్యులంతా తిరుపతికి వెళ్లగా 400 గ్రాముల రెండు వెండి బిళ్లలు, ఒక వెండి పళ్లెం సంఘం నిర్వాహకులు సభ్యులకు ఇచ్చారు. ఏటా ఈ ఉత్సవాల్లో కోతుల కోసం కొండెంగను కాపలాగా ఏర్పాటు చేస్తుండేవారు ఈ సారి అందుబాటులో లేకపోవడంతో కొండెంగను తీసుకురాలేదు.

ఉమ్మడి జిల్లాలోనే రికార్డు స్థాయిలో లడ్డూ వేలం

ఆదిదేవా వెల్ఫేర్ ఏర్పాటు చేసే వినాయకుడి వద్ద లడ్డూ పొందితే తాము కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం బలంగా ఉంది. దీంతో ఈ లడ్డూ కోసం వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఇతరులు దక్కించుకునేందుకు పోటీ పడుతూ చివరి రోజున వేలం పాట ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. 2018లోనే ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా రూ.1.71లక్షలకు బచ్చు పరమేశ్వర్, 2019లో అంతకంటే ఎక్కువగా రూ.2.11 లక్షలకు ఓలం బుచ్చిలింగం, 2022లో రూ.2,01,516లకు ఖమ్మంకు చెందిన బుద్ధ శ్రీకాంత్, 2023లో రూ.2,21,116లకు తాజా మాజీ సర్పంచ్ భట్టు శ్రీను-కవిత దంపతులు దక్కించుకున్నారు. గత ఏడాది అన్ని రికార్డులను తిరగరాస్తూ అంతకు రెట్టింపు స్థాయిలో రూ.4,51,116లకు కేసముద్రం స్టేషన్‌కు చెందిన దివంగత కల్లెపల్లి యాకయ్య భార్య రైల్వే ఉద్యోగి శిరీష దక్కించుకోవడం విశేషం. ఈ లడ్డూ పదేళ్లుగా రూ.లక్షకు పైగానే వేలం పాట పాడి భక్తులు పొందుతున్నారు. ఉత్సవాలకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఖర్చవుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

సభ్యుల సహకారంతోనే ఉత్సవాల నిర్వహణ

తేరాల శ్రీనివాస్, ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు



ప్రతీ ఏటా చందాలు ఎవరినీ అడకుండానే సభ్యుల సహకారంతో ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి ఆర్థిక సహకారం అందిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈసారి ఉత్సవాలకు రూ.10 లక్షల వరకు వ్యయం అవుతోంది. రైల్వే శాఖ, కేసముద్రంతో పాటు వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉన్న భక్తులు ఈ ఉత్సవాలకు సహకరిస్తున్నారు.

రాత్రి విధుల్లో మేము సైతం..

- రాత్రి పెట్రోలింగ్‌లో మహిళా పీసీలు
- సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న నారీమణులు
- ప్రశంసిస్తున్న నెక్కొండ మండల వాసులు

నెక్కొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కానిస్టేబుళ్ల విధుల్లో చేరుతున్న మహిళలు మొదట్లో పట్టణ పోలీస్‌స్టేషన్లకే పరిమితమయ్యేవారు. కొంత కాలం తర్వాత గ్రామీణ ప్రాంత పోలీస్‌స్టేషన్లలోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్ సన్నిహిత కౌంటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకే పరిమితం కాగా, నెక్కొండ పోలీసు స్టేషన్‌లో విధులను నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు ముఖ్య నేతల పర్యటనలో బందోబస్తు నిర్వహించడంతో పాటు రాత్రి సమయంలో పెట్రోలింగ్ విధులు, బ్లాకోట్స్ విధులను నిర్వహిస్తున్నారు. దీంతో మహిళా కానిస్టేబుళ్లను శభాష్.. అంటూ మండల వాసులు మెచ్చుకుంటున్నారు. పల్లె ప్రాంతాల్లో విధులను నిర్వహించడం సామాన్య విషయం కాకపోవడంతో కొన్ని సందర్భాల్లో పోలీసులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటుండగా పురుషులకు దీటుగా మహిళలు రాత్రి సమయంలో విధులను నిర్వర్తించడం సామాన్య విషయం కాదంటున్నారు. ముఖ్యంగా నెక్కొండలో రైల్వేస్టేషన్ ఉండడంతో రాత్రి సమయంలో ఇతర రాష్ట్రాలకు చెందిన రకరకాల వ్యక్తులు రైళ్లు దిగుతుంటారు. వారి వివరాలు కనుగొనడం ఆషామాషీ కాదంటున్నారు. సీపీ ఆదేశాల మేరకు మహిళా కానిస్టేబుళ్లకు డ్యూటీలు వేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మహిళా పీసీలు సరిత, మంజుల, అనూష, వినీత రాత్రి సమయంలో తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తుండడంతో మండల ప్రజలు వారిని ప్రశంసిస్తున్నారు. నాడు మహాత్మాగాంధీ అర్ధరాత్రి మహిళలు ఒంటరిగా తిరిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్న ఆయన మాటలను నేడు మహిళా పీసీలు నిజం చేస్తున్నారు.


నెక్కొండలో గణేశ్ మండపం వద్ద బాటసారుల వివరాలు తెలుసుకుంటున్న పీసీ సరిత

ఓటరు లిస్టులో అవకతవకలను సవరించాలి

● ఓటరు ముసాయిదాపై పలు మండలాల్లో జరిగిన సమావేశాల్లో ప్రజాప్రతినిధుల వెల్లడి ● జోరుగా అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు


మహాముత్తారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

వాజేడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఓటరు ముసాయిదాపై శనివారం రాజకీయపార్టీలతో ఎంపీడీవో శ్రీకాంత్‌నాయుడు సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు రానున్న తరుణంలో ఓటరు లిస్టుపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో నాయకులు పలు అభ్యంతరాలను ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. పోలింగ్‌స్టేషన్లకు దూరంగా ఉన్న గ్రామాలకు పోలింగ్ సమయంలో వాహనాలను ఏర్పాటుచేసి ఓటర్లను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై ఎంపీడీవో స్పందిస్తూ అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్‌వర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షు డు పెనుమళ్ల రామకృష్ణారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, సీపీఐ నాయకుడు రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు జగపతిబాబు తదితరులు పాల్గొన్నారు.

● మహాముత్తారం : స్థానిక సంస్థల ఎన్నికల పక్రియలో భాగంగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ లపై శనివారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ డీ. శ్రీనివాస్ రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎమైనా సందేహాలు ఉంటే తెలుపాలని కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మార్క రాము గౌడ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

●మహదేవపూర్ : మహదేవపూర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పర్యవేక్షకులు ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా(డ్రాఫ్ట్)పై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై వారి అభిప్రాయాలు వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా పర్యవేక్షకులు శ్రీధర్ వారి అభిప్రాయాలను నోట్ చేసుకున్నారు.

● మంగపేట : మంగపేట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని సమావేశపు హాల్లో శనివారం మండలంలో గల రాజకీయ పార్టీలతో ఓటర్ జాబితాలపై అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని మండల అధికారులు ప్రత్యేక సమావేశం స్థానిక ఎంపీడీవో బి.భద్రు అధ్యక్షతన జరిగింది. ఓటరు లిస్టుల్లో పేర్ల తప్పొప్పులు, పేర్ల మార్పులు వంటి వాటిపై రాజకీయ నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓటరు లిస్టులు ముఖ్యంగా రాజుపేట, కోమటిపల్లి, మంగపేట, కమలాపురం, అకినెపల్లి- మల్లారం వంటి గ్రామ పంచాయతీల్లో ఎక్కువగా తప్పులు దొర్లాయని వాటన్నిటిని వెంటనే సవరించి కొత్త లిస్టులను తయారు చేయాలని అధికారులను రాజకీయ పార్టీల నాయకులు కోరారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం ఆయా అభ్యంతరాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలని పార్టీ కార్యకర్తలతో ఆయా గ్రామాల్లో తప్పులు లేని లిస్టుల పునుద్దరణకు కృషి చేయాలని ఎంపీడీవో భద్రు, ఎంపీవో పొదిల శ్రీనివాస్‌లు కోరారు.

● కాటారం : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గ్రామపంచాయతీల ఓటర్ల జాబితాల డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై శనివారం అధి కారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. 24జీపీలకు సంబంధించి 30,785ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా పబ్లికేషన్ చేసినట్లు ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో వీరస్వామి నాయకులకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకుడు రమేష్‌రెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, సీపీఎం మండల అధ్యక్షుడు ఆత్కూరి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


వాజేడులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌నాయుడు

ఉత్తమ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, కస్తూర్బా గాంధీ విద్యాలయం, తెలంగాణ మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2025 విద్యా సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి డి చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోదలిచిన ఉపాధ్యాయులు ధరకాస్తు ఫారంతో పాటు పాఠశాలలో పనిచేసిన వినూత్న కార్యక్రమాల వివరాలు జతపరిచి రెండు కాపీలు సెప్టెంబర్ 1 వరకు సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు అందజేయాలని, మండల విద్యాశాఖ అధికారులు ప్రతి మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులను సిఫార్సు చేస్తూ వారి పూర్తి ప్రొఫైల్ ధరకాస్తులను సెప్టెంబర్ 2 తేదీ ఉదయం 11 గంటలలోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు.

చదువుల తల్లికి చేయూత

కన్నాయిగూడెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి జగదీశ్వరి పై చదువుల కోసం ముప్పనపల్లి సహాయనిధి సభ్యులు చేయూత నందించారు. ఇటీవలే వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి ప్రమీల తిరుపతి (లేటు)ల పెద్ద కుమార్తె జగదీశ్వరి చత్తా చాటి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హర్యానాలో సీటు సాధించింది. జగదీశ్వరి చదువుల కోసం ప్రతి సంవత్సరం ఒక లక్ష రూపాయల ఖర్చు అవుతుంది. విషయం తెలుసుకున్న ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు దాతల ద్వారా సేకరించిన రూ.10 వేలను సహాయనిధి అధ్యక్షుడు అబ్బు సతీష్, స్థానిక ఎస్సై ఇనిగాల వెంకటేష్‌తో కలిసి శనివారం ప్రమీలకు అందజేశారు. కాంగ్రెస్ మండల పార్టీ ఇన్‌చార్జి జాడి రాంబాబు, రాజేష్, విజయ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం

కాటారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):మండలంలో పౌర హక్కుల దినాన్ని ప్రతి నెల నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ ఆరోపించారు. మండలకేంద్రంలో శనివారం సీపీఎం నాయకులతో కలిసి శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనం రూపుమాపడానికి ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించి పలు శాఖల అధికారులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సివిల్ రైట్స్ డే నిర్వహ ణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నేతలు బొడ్డు స్మరణ్, తరుణ్, రవి, శ్యామ్, సిద్ధు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలతో ఎంతో మేలు

కాటారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):పిల్లల సామాజిక, భావోద్వేగ, మానసిక, శారీరక అవసరాలను తీర్చి వారి సమగ్రాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు తోడ్పడతాయని ఐసీడీఎస్ మహదేవపూర్ ప్రాజెక్ట్ సీడీపీవో రాధిక అన్నారు. శనివారం మండలంలోని పలు జీపీల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ(ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య) డే ను ఘనంగా నిర్వహించారు. రేగులగూడెం జీపీ పరిధిలోని దేవరాంపల్లి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈసీసీఈ డే లో పాల్గొన్న సీడీపీవో తల్లులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏడబ్ల్యూసీల్లో పిల్లలకు ఆటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థి కేంద్రీకృత పాఠ్యాంశాలు, కార్యకలాపాల ద్వారా పిల్లలకు ఆటలతో కూడిన విద్యార్జన కోసం ప్రత్యేక సిలబస్ రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ గంగారం, కాటారం సెక్టార్ సూపర్వైజర్లు వీణ, శివరాణి, అంగన్వాడీ టీచర్లు కమలాదేవి, శ్రీలతారెడ్డి, అన్నపూర్ణ, సువర్ణ, మణిమాల, రజిత, స్వరూప, శ్రీలత తదితరులు ఉన్నారు.

విద్యాశాఖ ఉద్యోగి బాధ్యతల స్వీకరణ

ములుగు టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పెద్దపల్లి జిల్లాకు కిరణ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. కిరణ్‌కుమార్‌ను తన కార్యాలయంలో సమగ్ర శిక్షా జాక్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఫిరోజ్, సిస్టమ్ అనలిస్ట్ అనుముల ప్రవీణ్, కోశాధికారి కుమార్ పాడ్య, సంయుక్త కార్యదర్శి నాంపల్లి చిరంజీవి, సభ్యులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మల్హర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు 1న జరిగే పాత పెన్షన్ సాధన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కోరారు. శనివారం మండలంలోని వల్లెంకుంట ఉన్నత పాఠశాల ఆవరణంలో బోజన విరామ సమయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్, గెజిటెడ్ ప్రధానోపా ధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మన్ బాబు, ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఎస్టీయూటీఎస్ నాయకులు రమేష్‌నాయక్, పీఆర్‌టీయూ నాయకులు తిరుపతిరెడ్డి, టీటీయూ నాయకులు రఘువీర్‌నాయక్ పాల్గొన్నారు.

● మహాముత్తారం : పీఆర్‌టీయూ ఆధ్వర్యంతో సెప్టెంబరు1న హైదరాబాద్ ఇందిర పార్కు వద్ద నిర్వహించన్ను దర్నా పోస్టర్‌ను మండల కేంద్రంలో ఎంఈవో రవీందర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు ఓపీఎస్ ముద్దు అనే నినాదంతో పోరాటానికి పీఆర్‌టీయూ సిద్ధమైందని ఆయన అన్నారు. ఈ దర్నాలో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు రవినాయక్, ప్రదానకార్యదర్శి రవిందర్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మహాముత్తారంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

వరద బాధితులకు చేయూత

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వరదల్లో ఇబ్బందులు పడ్డ ప్రజలకు రిలయబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సరుకుల పంపిణీ జరిగింది. మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ(రెవెన్యూ), జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు హాజరై మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలకు చెందిన వరద బాధితులు 100మందికిపైగా నిత్యావసర సరుకులు, టార్పాలిన్ కవర్లు, దుస్తులు, వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడారు. తహసీల్దార్ జగదీశ్వర్, మండల ప్రత్యేక అధికారి రాంపతి, ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ రవి, కాంగ్రెస్ నాయకులు చిటమట రఘు, ఇర్సవడ్ల వెంకన్న, వావిలాల చిన్నఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి డీజేలకు అనుమతి లేదు..

గోవిందరావుపేట : గణేష్ నిమజ్జనోత్సవంలో డీజే సౌండ్ సిస్టంకు అనుమతి లేదని పస్రా సీఐ దయాకర్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన డీజే యజమానులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గణపతిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తీసుకెళ్లాలని, డీజేలు, సౌండ్‌బాక్స్‌లతో పాటలు పెట్టి ప్రజలను ఇబ్బంది కలిగించరాదని అన్నారు. ఎవరైనా నిమజ్జనం రోజున డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై కమలాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పుట్ట మధు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాటారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):మండలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. దేవరాంపల్లి గ్రామంలో తుంటి ఎముక విరిగి అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ బండం రాజమణి తల్లి కామిడి మల్లక్కను పరామర్శించి దైర్యం చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి ఆరోగ్యస్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేష్, పంతకాని సడువలి, నరివెద్ది శ్రీనివాస్, కామిడి ప్రమోద్, దుర్గారావు, గాజుల విక్రమ్, మురారి, మనోహర్, వంశీ, తిరుమల్, ప్రదీప్ ఉన్నారు.

వరద గోదారి

(5వ పేజీ తరువాయి)

దిగువకు వదులుతూ బ్యారేజీని ఫ్రీఫ్లోగా ఉంచారు. బ్యారేజీ వద్ద 83.30 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

తగ్గుతూ.. పెరుగుతూ

మంగపేట మండలంలోని కమలాపురం బిల్ట్ ఇంటెక్‌వెల్ వద్ద గోదావరి ప్రవాహం పెరుతూ తగ్గుతూ వస్తోంది. ఎగువన గల బ్యారేజీల గేట్లు ఎత్తడంతో పాటు, జలపాతాల నుంచి వర్షం కురిసినప్పుడు పెరుగుతుండడం, నెమ్మదిగా తగ్గుతూ వస్తోంది. శుక్రవారం రాత్రి వరకు సముద్రమట్టానికి 84.5 ఫీట్ల వరకు ప్రవాహించిన వరద.. తెల్లవారు జాము వరకు 82 ఫీట్లకు తగ్గింది. తర్వాత ఉదయం కొంత సేపటికి 83 ఫీట్లకు చేరింది. తర్వాత మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిలకడగానే ఉంది. సాయంత్రం 5 గంటల వరకు మళ్లీ 81.5ఫీట్ల వరకు చేరింది. అయితే కమలాపురం ఎర్రవాగు, మంగపేట గౌరారం వాగు నీటి ప్రవాహం వల్ల బ్యాక్ వాటర్ తగ్గకుండా నిలకడగానే ఉంది. దీంతో వందలాది ఎకరాల వరి నీటిలోనే ఉంది. బాధిత రైతులు మాత్రం తాము వేసిన పంట ఇప్పటికే మూడుసార్లు బ్యాక్ వాటర్‌తోనే మునిగి పోయిందని, ఈసారి పంట కుళ్లిపోయే ప్రమాదం ఉండడమే కాకుండా తెగుళ్ల సోకే అనుమానాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం తగ్గుముఖం.. సాయంత్రం పెరుగుదల

వాజేడు మండలంలోని పేరూరు వద్ద గోదావరి దోబూచులాడుతోంది. తగ్గినట్టే తగ్గి మరలా సాయంత్రం నుంచి పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6గంటలకు 16.740 మీటర్ల నీటిమట్టంతో ఉండగా, 9గంటలకు కాస్తంత తగ్గి 16.730కు చేరుకుంది. 10గంటల నుంచి 16.720 మీటర్లకు చేరుకొని నిలకడగా మూడుగంటల వరకు నీటి ప్రవాహం ఉంది. మరల 4గంటలకు 16.730 మీటర్లు, 5గంటలకు 16.740 మీటర్లకు చేరుకొని నీటి ప్రవాహం పెరిగింది. కాగా వరద ప్రవాహంతో టేకులగుడెం వద్ద జాతీయ రహదారి నీట మునగడంతో అంతర్‌రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా పేరూరు- చంద్రుపట్ల, ఏడ్జర్లపల్లి-బొమ్మనపల్లి, వాజేడు-గుమ్మడిదొడ్డి, కోయవీరాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

అలరించిన కళా ఉత్సవం

చిట్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి కళాఉత్సవం పోటీలు అలరించాయి. మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి కళా ఉత్సవ పోటీలను ప్రారంభించి, నృత్యాలను తిలకించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని పది అంశాల్లో తమ ప్రదర్శనను కనబర్చారు. పలువురు వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో జూకల్లు పాఠశాల హెచ్ఎం గిరగాని కృష్ణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు నీలిమారెడ్డి, సాంబమూర్తి, వందన, స్వరూప, శంకర్, రామ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా స్వచ్ఛ హరిత విద్యాలయం ర్యాంకింగ్‌పై మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం అవగాహన కల్పించారు.

వినాయక మండపాల వద్ద అన్నదానాలు , కుంకుమ పూజలు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాలు, కుంకుమ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు. భక్తులు ఉత్సాహంతో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

● మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలోని అర్యవైశ్య సంఘంలో నిర్వహించిన గణపతి నవరాత్రుల్లో నాలుగోరోజు శనివారం గణనాథుడికి మహిళలు పలు రకాల మంగళహారతులతో పూజలు నిర్వహించారు. ఒక్కో మహిళ ఒక్కో రకమైన మంగళహారతిని అలంకరించుకుని తీసుకొచ్చారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గణేశ్ నగర్‌లో ఏర్పాటు చేసిన పది తలల సర్పాలపై కొలువైన గణపతి విగ్రహం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రత్యేకమైన గణపతి విగ్రహాన్ని హన్మకొండ నుంచి కొనుగోలు చేసి ఏటూరునాగారానికి తీసుకొచ్చామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

● మంగపేట : మండలంలోని గ్రామాల్లో వాడల్లో వెలిసిన వినాయక విగ్రహాల మంటపాల వద్ద నిత్యం పలురకాల పూజలు, అర్చనలు, అభీషేకాలు చేయడమే కాకుండా కుంకుమ పూజలను మహిళలు చేస్తున్నారు. ఇదేక్రమంలో కమలాపురంలో 36 చోట్ల ఏర్పాటు చేసిన వినాయక మంటపాల వద్ద చిన్నారులు, యువతీ యువకులు, మహిళలు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్యాన్స్‌లు చేసి చూపరులను ఆకట్టుకున్నారు.


కమలాపురం ఇందిర కాలనీలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఆర్టిజన్ కమిటీ జేఏసీ చైర్మన్‌గా సురేందర్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా పరిధిలోని విద్యుత్ ఆర్టిజన్ కమిటీ జేఏసీ చైర్మన్‌గా యాళ్ల సురేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత చైర్మన్ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో సురేందర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏసీ జేఏసీ) శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

నూతన నిర్మాణంలో అవకతవకలు

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో అవకతవకలు జరుగుతున్నాయని, దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకుడు ఎస్వీకే సాగర్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఓ భవన నిర్మాణంలో అనుమతులు లేకుండానే నిర్మా ణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే ఈ భవనంలో రెసిడెన్షియల్‌గా ఉన్న అనుమతులను రద్దుచేసి కమర్షియల్‌గా మార్చి అనుమతులు ఇవ్వడంలో ముని సిపాలిటీ అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని తెలిపారు. కాగా ఈ విషయ మై కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

మహదేవపూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్ల సంయుక్త కార్యచరణ కమిటీ 206 సంఘాల ఆధ్వర్యంలో జరుగబోయే కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో టీజేఏసీ ఉపాధ్యాయ సంఘం నాయకులు, కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశా లల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సంఘ నాయకులు బి.తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎం.మధు, సారంగపాణి, దేవేందర్‌రెడ్డి, రాజయ్య, సునీల్ కుమార్, శ్రీనివాసరెడ్డి, కళ్యాణి, ఆర్.తిరుపతిరెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

ఏటూరునాగారం రూరల్/ములుగుటౌన్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించడం జరుగుతుందని ఏవోలు వేణుగోపాల్, ఆర్.పరమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గానూ ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు 50శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడి వర్తిస్తుందన్నారు. బ్యాటరీ పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రోటోవేటర్స్, కల్టివేటర్స్, సీడ్ కమ్ ఫర్టి డ్రిల్, పవర్ వీడర్, బ్రష్‌కట్టర్, టిల్లర్, బేలర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌లను జతపరిచి మండలకేంద్రంలోని రైతు వేదికలో సమర్పించాలని ఏవో ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

మొగుళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ సునీత పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కాలనీవాసులు పలు సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈకార్యక్రమంలో ఎంఈవో కుమారస్వామి, ఎస్సై బి.అశోక్, ఆర్‌ఐ శివరామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించిన ఫారెస్టు అధికారులు

మల్హర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్లపల్లి అటవీ ప్రాంతంలో గత జూన్‌లో లేగదూడ పై పులి దాడి చేసిన విషయం విదితమే. పులి దాడిలో ఎడ్లపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజయ్య లేగ దూడ మృతి చెందగా శనివారం కొయ్యూర్‌లో రేంజ్ కార్యాలయంలో రేంజర్ రాజేశ్వర్‌రావు పరిహార చెక్కును బాధితుడికి అందించారు. రూ 30 వేల చెక్కు మంజూరు కాగా బాధితుడికి అందించారు. సెక్షన్ అధికారి ఇంతియాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎడ్ల బండి చక్రాలు ఎత్తుకెళ్లిన దొంగలు

మహాముత్తారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యామన్‌పల్లి గ్రామంలో ఇంటి ముందు ఉంచిన ఎడ్ల బండి చక్రాలను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. రైతు జిముడ సారయ్య తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటిలాగానే శుక్రవారం ఎడ్ల బండితో పొలానికి వెళ్లి వచ్చి ఇంటి ముందు బండి ఉంచానని శనివారం ఉదయం చూడగానే రెండు చక్రాలను దొంగలు తీసుకుపోయారని తెలిపారు. దీంతో రూ. 15వేల నష్టం జరిగిందని రైతు ఆవేధన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపారు.

సారయ్య ఆశయ సాధన కోసం కృషి చేయాలి

వెంకటాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దివంగత సీపీఎం పార్టీ నాయకుడు గ్యానం సారయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకులు బండారి రవికుమార్, సూడి కృష్ణారెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో సారయ్య ఐదో వర్ధంతి వేడుకలు జరగగా వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు గ్యానం వాసు, రాజేందర్, చిట్టెం ఆదినారాయణ, కుమ్మరి శ్రీను పాల్గొన్నారు.

నానో ఎరువులతో పర్యావరణాన్ని కాపాడాలి

మల్హర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : నానో ఎరువులను వాడి పర్యావరణాన్ని కాపాడాలని మండల వ్యవసాయాధికారి శ్రీజ అన్నారు. శనివారం మండలంలోని కొయ్యూర్ గ్రామంలో రైతులకు నానో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. సంప్రదాయ ఎరువుల అధిక వాడకం వల్ల నేల, నీరు, గాలి కలు షితమయ్యే అవకాశం ఉందని నానో ఎరువులు నేరుగా మొక్కలకు అందు తాయన్నారు. దీంతో కాలుష్యం తగ్గి భూసారం దెబ్బతినకుండ ఉంటుందన్నారు. సంప్రదాయ ఎరువుల వల్ల కాకుండా నానో ఎరువులను తరలించడం, నిల్వ చేయడం సులభమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేసిన అధికారులు

కాటారం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎస్సై శ్రీనివాస్ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని ఆదేశించారు. స్టోర్ రూం, వంట గదుల్లో వస్తువులు, వంటసామాగ్రి, భోజనం తయారు చేస్తున్న తీరుని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సాదకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. హెచ్‌డబ్ల్యూవో భవానీ, హాస్టల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

మహదేవపూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి ఆదేశానుసారం పీడీ పూర్ణిమ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటా రాజబాబు, సీఐ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ సల్ల తిరుపతిరెడ్డి, ఎస్సై పవన్‌కుమార్, ఎంఈవో ప్రకాష్‌బాబు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అనిల్‌కుమార్, రిటైర్డ్ పీటీ అంకమ్మ, గుడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.